# ప్రభుత్వ విధానాల వల్ల విలవిలాడుతున్న వృత్తులు, వృత్తిదారుల రక్షణకై ఉద్యమిద్దాం!











**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ

# ప్రభుత్వ విధానాల వల్ల విలవిలాడుతున్న వృత్తులు వృత్తిదారుల రక్షణకై ఉద్యమిద్దాం

**సిపిఎం**

రాష్ట్రంలో చేతి వృత్తిదారులు వృత్తులను కోల్పోతున్నారు. ప్రభుత్వాలు వారిని ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నాయేగానీ వారి సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. రాష్ట్రంలో బీసీలు సుమారుగా రెండున్నర కోట్ల మంది ఉన్నారు. వీరిలో చేతి వృత్తిదారులు దాదాపు కోటీ 70 లక్షల మంది వరకూ ఉన్నారు. చేనేత, గీత, రజక కుమ్మరి, మేదర, మత్స్య, వడ్రంగం, కంచర, స్వర్ణకార, కమ్మర, శిల్పం, క్షౌర, దర్జీ, గొర్రెల మేకల పెంపకం వంటి వృత్తులన్నీ ప్రపంచీకరణ, ప్రభుత్వాల విధానాల కారణంగా ధ్వంసమవుతున్నాయి. వృత్తిదార్లు  ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారు. ఆత్మహత్యలకూ, ఆకలిచావులకూ గురవుతున్నారు. చేతి వృత్తులను రక్షించాల్సిన రాష్ట్రప్రభుత్వం వాటిని నాశనం చేస్తోంది.

వస్త్ర రిజర్వేషన్ల చట్టాన్ని ఉల్లంఘిస్తున్న పవర్‌లూమ్ యజమానులకు ప్రభుత్వం కొమ్ముకాస్తూ చేనేత కార్మికులను బలి తీసుకుంటోంది. ఈ ఏడాది  ఒక్క అనంతపురం జిల్లాలోనే 37 మంది చేనేత కార్మికులు బలయ్యారు. సముద్ర, నదీ తీర ప్రాంతాల్లో వివిధ ప్రాజెక్టులూ, సెజ్‌లూ, పోర్టుల పేరుతో మత్స్యకారులను గెంటేస్తున్నారు. చేపలు పట్టడానికి వీల్లేకుండా చేసి ఉపాధిని దెబ్బతీసి ప్రభుత్వం వలసలను ప్రోత్సహిస్తోంది. నూతన ఎక్సైజ్ చట్టం పేరుతో బెల్టుషాపుల సంఖ్యను పెంచి గీత కార్మికుల పొట్టకొడుతోంది. ప్రమాదవశాత్తూ మృత్యువాత పడిన వారికి ఎక్స్‌గ్రేషియో కూడా చెల్లించకుండా అమానుషంగా వ్యవహరిస్తుంది. రోడ్లు వెడల్పు చేస్తూ క్షౌరవృత్తిదారులకు సెలూన్లు పెట్టుకునే

అవకాశం లేకుండా చేసి వారి వృత్తిని బడా వ్యాపార సంస్థలతో అధీనం చేస్తోంది. నూతన యంత్రాల ప్రవేశంతో రజక, వడ్డెర వంటి వృత్తుల్లో జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటోంది. బంజరు భూములు, మేత భూములను రియల్ ఎస్టేట్ సంస్థలకూ, బహుళజాతి సంస్థలకూ కట్టబెట్టడంతో మేత వనరులు లేక గొర్రెల, మేకల పెంపకం తగ్గిపోతోంది. అడవిలో మేపుకోవటానికి ఆటంకాలు కలిగిస్తోంది. ఇక, కుమ్మరి, కమ్మరి, మేదర, వడ్రంగం, స్వర్ణకారులు, దర్జీ (టైలరింగ్) తదితర వృత్తులను గాలికి వదిలేసింది.

## వాగ్దానాలు – రుణమాఫీ – దగా

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చే ముందు చేతివృత్తుల వారికీ వెనుకబడిన తరగతులకూ ఆశాజనకమైన, ఆకర్షణీయమైన వాగ్దానాలు చేసింది. అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని ప్రభుత్వం విస్మరించింది. 'కుల వృత్తుల, చేతి వృత్తుల వారిని ప్రోత్సహించడానికి అన్ని సదుపాయాలతో వృత్తి సముదాయాలు ఏర్పాటు వివిధ వృత్తుల పనిముట్లు ఆధునికీకరణకు తగు నిధులు మంజూరు. చేతి వృత్తుల వారికి వృత్తి నిర్వహణకు అవసరమైన విద్యుత్తు రాయితీ కల్పించడంతోపాటు ప్రమాదవశాత్తూ మరణించిన వారికి రూ. రెండు లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష దరఖాస్తు చేసుకున్న వారందరికీ నెల రోజుల్లో ఎక్స్‌గ్రేషియో మొ॥వాగ్దానాలు చేసింది. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయింది. 13 జిల్లాల్లో చేతి వృత్తుల వారికి సముదాయాలు లేవు. రజకులకూ, క్షౌర వృత్తిదారులకూ గ్రామ పంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్లలో చట్ట ప్రకారం కాంప్లెక్స్‌లను కేటాయించనూ లేదు. దీంతో అద్దెలు పెరిగి షాపుల ఎలా నిర్వహణ తీవ్ర ఆందోళనగా మారింది. వివిధ వృత్తుల అభివృద్ధికి ఆధునిక పనిముట్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం వాగ్దానాలన్నీ గాలికొదిలేసింది. లక్షలాది చేనేత మగ్గాలు మూతపడుతున్నాయి. ప్రస్తుతం వృత్తిదారులు వాడే పనిముట్ల విద్యుత్తు బిల్లు తడిసి మోపెడవుతున్నాయి. స్వర్ణకార, వడ్రంగం, క్షౌర వంటి వృత్తుల వారికి విద్యుత్తు ఛార్జీలో రాయితీ ఇస్తామని చేసిన ప్రకటన నీటి మూటయ్యింది. దోభీఘాట్‌లకు వాడే కరెంటు బిల్లులను స్థానిక సంస్థలు చెల్లించకుండా రజకులపై నెట్టడానికే ప్రయత్నిస్తున్నది. ఈ ఏడాది కాలంలో కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, గొర్రెల కాపరులు ఎందరో వృత్తిచేస్తూ ప్రమాదాల్లో చనిపోయారు. ఏడాది గడిచినా ఒక్కరికీ ఎక్స్‌గ్రేషియో చెల్లింపులేదు.

## బడ్జెట్ - బాబు మాయాజాలం

చేతి వృత్తుల, కుల వృత్తుల ఫెడరేషన్లను బీసీ కార్పొరేషన్లతో అనుసంధానం చేస్తానన్నారు. ఆచరణలో వాటి మధ్య సంబంధమే లేకుండా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ అభ్యుదయ పథకాన్ని మార్చేసి 'బిసి అభ్యుదయ పథకం'గా మార్చారు. గతేడాది రూ. 30 కోట్లు కేటాయించినట్లున్నా ఖర్చు చేయక రాలేదు. ఉపాధి కల్పించలేదు. పథకాలకు పేర్లు మార్చడం తప్ప ఖర్చు ఏది? చేతి వృత్తులు, కుల వృత్తులలో లేని బిసిలకు ఉపాధి కోసం ప్రత్యేక పథకాలు ప్రవేశ పెడతామని చెప్పారు. బడ్జెట్‌లో కనీస కేటాయింపులుగానీ, ప్రస్తావనగానీ లేదు. నాలుగు నెలలు పూర్తవుతున్నా ఆ నిధులు విడుదల కాలేదు. లబ్ధిదారుల గుర్తింపు లేదు. గతేడాది వెనుకబడిన తరగతుల వృత్తిదారుల ఉపాధి కోసం రూ.550 కోట్లు కేటాయించింది. రూల్స్‌పేరుతో ఆటంకాల కల్పించి చివరికి నిధులు మంజూరే చేయలేదు. ఈ సంవత్సరం కూడా బడ్జెట్‌లో రూ.3,120 కోట్లు కేటాయించింది. మొత్తం బిసిలలోని చేతివృత్తులకు చెందిన వారికి ఆర్థిక సహాయం నిమిత్తం రూ.385 కోట్లు కేటాయించారు. జిల్లా స్థాయిల్లో ఎటువంటి చర్యలు తీసుకోలేదు. 'నమ్మించటం', 'భ్రమలు కల్పించడం', 'పబ్బం గడుపుకోవడమే' తెలుగుదేశం ప్రభుత్వం విధానం ఉంది. ప్రభుత్వ విధానాల ఫలితం వృత్తిదారులు ఉపాధి కోల్పోవడం. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయమూ అందకపోవడంతో గత్యంతరంలేక అనేకులు వృత్తులు వదిలి అసంఘటిత కార్మికులుగా, గ్రామీణ శ్రామికులుగా మారుతున్నారు.

## బిసి సబ్ ప్లాన్ కాదు - ఎన్నికల ప్లాన్

రాష్ట్రంలో బిసిలు రెండున్నర కోట్ల మంది కోటి 70 లక్షల మంది 63 రకాల వృత్తులు చేస్తున్న వీరికి వృత్తులే ప్రధాన జీవనాధారం. వెనుకబడిన తరగతుల్లోవారికి 42 శాతం మంది వద్ద అర ఎకరం లోపు మాత్రమే భూమి ఉంది. 58 శాతం మందికి భూమి లేదు. వీరిలో నిరక్షరాస్యతా ఎక్కువే. వీరి తలసరి, దినసరి ఆదాయం రూ.27కి మించి లేదు. వీరి కుటుంబాల్లో బాల్య వివాహాలు ఎక్కువ. నమ్మకాలు, మూఢ విశ్వాసాలు బలంగా ఉన్నాయి. వడ్డెర, మేదర, కుమ్మరి మొ॥ వారి బస్తీల్లో మంచినీరు, డ్రెయినేజీ, విద్యుత్తు, రోడ్లు తదితర సౌకర్యాలు అరకొరగానే ఉన్నాయి. ఇళ్లూ, ఇళ్ల స్థలాలు లేనివారూ అధిక శాతమే. సరళీకృత ఆర్థిక విధానాల మూలంగా వృత్తులు మూలబడి ఉపాధిపోయి బలవంతంగా గెంటి వేయబడుతున్నారు. కౌలు రైతులుగా, చిన్న, సన్నకారు రైతులుగా

లక్షల సంఖ్యలో ఉన్న వీరికి వ్యవసాయం గిట్టు బాటుగాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. సబ్ ప్లాన్‌ను ఏర్పాటు చేస్తే బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయిస్తామన్నారు. మొదట సంవత్సరం బడ్జెట్‌లో సబ్ ప్లాన్ ఊసే లేదు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో నిధులు కేటాయింపు లేదు. ఇటీవల బిసి సబ్ ప్లాన్ ఏర్పాటు విషయంపై మంత్రివర్గం చర్చించిందట, రూ.6 వేల కోట్లు కేటాయిస్తారంట. ఇందులో 3 వేల కోట్ల రూపాయలు స్కాలర్‌షిప్పులకు అవసరం. మిగిలిన 3 వేల కోట్ల రెండున్నర కోట్ల మంది బిసిల సంక్షేమానికి ఏ మూలకొస్తాయి? అది వాస్తవంలో ఖర్చుపెడితే? అసలింతకీ అబ్జట్‌లో నిధులే లేకుండా ఈ 6 వేల కోట్ల రూపాయలు ఎక్కడ నుంచి ఇస్తారు? వట్టి విస్తరీ – మంచినీళ్ళతో తప్ప మరోసారి బిసిలను మోసగించడం.

## కేటాయింపులే– అమలు నాస్తి

ఈ ఏడాది కుల వృత్తుల వారికి గ్రామ, పట్టణాలలో సహాయం నిమిత్తం రూ.160 కోట్లు, పట్టణాలలో వెనుకబడిన తరగతుల వారికి రూ.30 కోట్లు కేటాయించారు. వీరికేకాక కుల వృత్తులు వారైన రజకులకు రూ.30 కోట్లు, నాయీ బ్రాహ్మణులకు రూ.30 కోట్లు, వడ్డెరలకు రూ.15 కోట్లు, వాల్మీకి / బోయలకు రూ. 15 కోట్లు, కృష్ణబలిజ / పూసల ఫెడరేషన్లకు రూ. 15 కోట్లు, బట్రాజులకు రూ.15 కోట్లు, మేదరలకు రూ.15 కోట్లు, కుమ్మరులకు రూ. 20 కోట్లు, విశ్వ బ్రాహ్మణులకు రూ.15 కోట్లు కేటాయించారు.

ఈ వృత్తిదారులందరికీ రూ.195 కోట్లు కేటాయింపులు జరిగాయి. కాని ఒక్క సొసైటీకి కూడా రుణం ఇవ్వలేదు. రుణం అడిగితే బ్యాంకులు ష్యూరిటీ కావాలట. ష్యూరిటీలు పెట్టడానికి వృత్తిదారుల దగ్గర ఏమీలేదు. బ్యాంకు రుణం మంజూరు కాలేదు కాబట్టి సబ్సిడీలు మంజూరు చేయటం లేదు. ఆ అచరణలో అమలు చేయలేని నిబంధనలు పెట్టి నిధులు ఖర్చు చేయడం లేదు. పైగా వృత్తిదారులదే వినియోగించుకోని లోపమంటున్నారు. న్యాయమేనా?

## చేనేతకు చేయూత ఏది?

చేనేత కార్మికుల రుణాలు (రూ.202 కోట్లు) రద్దు చేస్తాం. ప్రతి చేనేత కార్మికునికీ లక్ష రూపాయలు రుణం ఇస్తాం. బడ్జెట్‌లో ప్రతి ఏటా రూ. 1000 కోట్లు కేటాయిస్తాం. ఇత్యాది టి.డి.పి వాగ్దానాలు చేసింది. ఆచరణలో ఈ ఏడాదిలో అనంతపురంలోనే 37 మంది చేనేత కార్మికులు రుణ భారంతో చనిపోతే వారి కుటుంబాల్ని

ఆదుకొందిలేదు. బకాయిలు రద్దు చేయలేదు. కొత్త రుణాలు ఇవ్వనూ లేదు. ఈ ఏడాది బడ్జెట్‌లో 46 కోట్ల రూపాయలు కేటాయించి పండుగ చేసుకోమనడం వికృతంగా ఉంది. చేనేత సొసైటీలకు 20 శాతం రాయితీపై ఇచ్చే ముడిసరుకుల సరఫరా పథకం సక్రమంగా అమలు కాలా బినామీల పాలైంది. చేనేత వస్త్రాలపై 30 శాతం రిబేటు పథకం అటకెక్కింది. సగం ధరకే జనతా వస్త్ర పథకం కాగితాలకే పరిమితమైంది. చేనేత సహకార సంఘాలకు ఆప్కో ఇవ్వాల్సిన రూ.28 కోట్ల బకాయిలు చెల్లించ లేదు. సహకార రంగాన్నీవిధంగా నిర్వీర్యం చేస్తున్నారు. బినామీలు బోగస్ సొసైటీల్ని ఏర్పాటుచేసి అధికార పార్టీ అండతో సబ్సిడీలను కాజేస్తున్నా ప్రభుత్వం చేష్టలుడిగి చేస్తుంది. సబ్సిడీపై నూలు, శిల్క్, రంగులు, రసాయనాలు ఇస్తామని చేసిన వాగ్దానం ఏమైంది? మొత్తంగా చేస్తే ప్రభుత్వం నేత కార్మికులకు చేసిన సహాయం లేకపోగా ఉన్న ఉపాధి దెబ్బతీసే పవర్‌లూమ్ యజమానుల కొమ్ము కాస్తోంది. వ్యవసాయ రంగం తరువాత అత్యధికంగా ఉపాధి కల్పించే చేనేత రంగాన్ని ధ్వంసం చేసి పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం తొత్తుగా మారింది. చేనేత రుణాలు మాఫీ పోటు బయాయిలు చెల్లించడం ప్రకాశం జిల్లా చీరాలలో 1200 మందికి నోటీసులు ఇచ్చారు. 1985లో 20 లక్షల మగ్గాలుంటే. పదేళ్ల తరువాత 10 లక్షల ప్రస్తుతం 3 లక్షలకు తగ్గాయి. రాజీవ్ విద్యా మిషన్ ద్వారా ఆప్కో ఆర్డరు తీసుకొని చేనేత వస్త్రాలు కొని కుట్టించి బడి పిల్లలకు ఉచితంగా ఇవ్వాలి. ఆప్కో చేనేత వస్త్రాలు కొనుగోలు చేయకుండా పవర్‌లూమ్ వస్త్రాలు తీసుకొని చేనేత వస్త్రాలు తీసుకున్నామని రికార్డుల్లో చూపి వందల కోట్లు దళారులు కాజేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరవాలి చేనేత కార్మికుల రుణ బకాయిలనీ మాఫీ చేయాలి. ఆకలి చావులు, ఆత్మహత్యల నివారణకు చర్యలు చేపట్టాలి. అనంతపురం మొ॥ జిల్లాల్లో చేనేత రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న పవర్‌లూమ్ యజమానులపై క్రిమినల్ కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఆప్కో ఇవ్వాల్సిన బకాయిల్ని వెంటనే చెల్లించాలి. కనీస వేతన చట్టం తేవాలి. ప్రతి నేత కార్మికుడికీ 8 గంటల సాదా పనికి రూ.350 ఇవ్వాలి.

## గీత కార్మికుల పొట్టగొడుతున్న ప్రభుత్వం

రాష్ట్రంలో కల్లు గీత వృత్తి 70 శాతం దెబ్బతింది. ఒకప్పుడు టిసిఎస్‌లు, టిఎఫ్‌టిలు గీత కార్మికలకు ఉపాధి కల్పించే సంస్థలుగా ఉండేవి. సరళీకరణ ఆర్థిక విధానాలతో ఈ సహకార రంగం నిర్వీర్యమై పోయింది. బెల్టు షాపుల తోలు తీస్తానని చెప్పిన తెలుగుదేశం. గీత కార్మికుల పొట్టగొట్టెలా అసలు షాపుల సంఖ్యే మరింత

పెంచింది. చిన్న చిన్న షాపుల్లో కూడా అమ్ముతాననడం సంఖ్యే మరింత సిగ్గుచేటు. రైతులకు చెల్లించాల్సిన చెట్ల పన్నును  భారం కాకుండా తానే చెల్లిస్తానంది. చెట్ల పన్ను పేరుతో ప్రతి సంవత్సరమూ రూ.25 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి గీత కార్మికులు చెల్లిస్తున్నా కనీసం దాని నుండైనా కోటి రూపాయలు కూడా వీరి సంక్షేమానికి ఖర్చు పెట్టడం లేదు. ప్రమాదాల్లో చనిపోయిన వేల మంది గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియో చెల్లించలేదు. లక్ష మందికి పింఛన్లు ఇస్తామన్నారు. కొందరికే ఇచ్చి చేతులు దులుపుకుంది. మున్సిపాలిటీలలో కల్లు దుకాణాల ఏర్పాటుకు ఆటకంగా వున్న జీవో నెం.767ను రద్దు చేశారు. కాని పట్టణాలలో దుకాణాలు పెట్టకుండా ఆంక్షలు పెట్టారు. పర్యవసానంగా గీత కార్మికులకు దొరికే అరకొర ఆదాయాన్ని కూడా మద్యం వ్యాపారులే కాజేస్తున్నారు. లిక్కర్ పాలసీ పేరుతో దేశ విదేశీ  మద్యానికి ద్వారాలు తెరుస్తూ స్వదేశీ పానీయమైన కల్లును దెబ్బతీసి గీతకార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. గీత కార్మికులు చెల్లించే చెట్ల పన్నును రద్దు చేయాలి. హుదూద్ తుఫాన్ వల్ల నష్టపోయిన విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల గీత కార్మిలకు నష్ట పరిహారం ఇవ్వాలి. ఇచ్చిన హామీ మేరకు అదనపు షాపుల రద్దుకు చర్యలు తీసుకోవాలి. గీత వనాలను పెంచుకోవాటానికి ఇచ్చిన జీవో నెం.560ను పగడ్బందీగా అమలు చేయడానికి గీత సొసైటీలకు భూములు ఇవ్వాలి. గీత వృత్తిని రక్షించాలి. వృత్తి కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి.

## గొర్రెలు, మేకల పెంపకందార్ల – గొర్రెతోక జీవితం

గొర్రెలు–మేకల మేత కోసం ఆయా గ్రామాల్లో సొసైటీలకు భూములు కేటాయిస్తామన్నారు. ప్రభుత్వం బంజరు భూములను, గుట్టలను, కొండలను రియల్టర్లకు, పెత్తందార్లకు అప్పగిస్తోంది. కృష్ణాజిల్లా మూలపాడు గ్రామంలో 450 ఎకరాల మేత భూములను జగ్గే వాసుదేవ బాబాకు కేటాయించడానికి పూనుకొంది.  ఎన్నో సంవత్సరాల నుండి గొర్రెలు–మేకల పెంపకందార్లు జీవో నెం.559 ప్రకారం మేత వనరులు కోసం భూమి ఇవ్వాల్సుంది. అడుగుతుంటే చెవిటి వాని ముందు శంఖం ఊదినట్లు తనకేమీ ఎట్టనట్లు ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. ఫారెస్ట్‌లో జీవాలను మేపుకోవడానికి వీలు లేకుండా ఆంక్షలు పెడుతోంది. పుల్లరి పేరుతో ఫారెస్ట్ అధికారులు అందినంత డబ్బులను పెంపకందార్ల నుండి అక్రమంగా వసూలు చేస్తున్నారు. జీవో నెం.1016 ప్రకారం చెరువు శిఖాలను జీవాల మేత నిమిత్తం కేటాయించాలని ఉంది. ఆ జీవోను అముల చేయరు. నీరు–చెట్టు కార్యక్రమము ద్వారా చెరువు శిఖం భూములను, కుంటలను ధ్వంసం చేస్తున్నారు. గత

మూడేళ్ల కాలం నుండి నాబార్డు ద్వారా కేంద్ర ప్రభుత్వ రుణాలు పొందిన పెంపకందార్లకు రావల్సిన రూ.27 కోట్ల సబ్సిడీ విడుదల చేయలేదు. రాష్ట్రప్రభుత్వ బడ్జెట్ నుండి రాష్ట్ర ఫెడరేషన్‌కు 2006 నుండి ఇప్పటివరకు ఎటువంటి నిధులూ కేటాయించకపోవటం దారుణం. జీవక్రాంతి, గొర్రెల బీమా, గొర్రెల కాపరుల ఎక్స్‌గ్రేషియో పథకాలు నిధులు లేక నిర్వీర్యమవుతున్నాయి. అంతేకాకుండా జీవాల సంరక్షణకు వైద్య సేవలూ నామమాత్రంగానే ఉన్నాయి. బ్లూటంగ్, గాలికుంటు వ్యాధులు వల్ల ప్రతి యేటా ప్రతి 100 గొర్రెలలో 20 జీవాలు చనిపోతున్నాయి. వ్యాక్సిన్ కొనుగోలు చేసి వేయడంలేదు. పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్రంలో సుమారు 2 కోట్ల గొర్రెలు-మేకల సంపద ఉన్నది. వీటిపై 8 లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. వృత్తిలోనే పుట్టి వృత్తిలోనే జీవితాలను కొనసాగిస్తున్నారు. 40 సంవత్సరాలకే 60 ఏళ్ల ముసలివారుగా తయారవుతున్నారు. 50 ఏళ్ల పైబడిన వారికి పింఛను ఇవ్వాలనే న్యాయమైన కోర్కెను తెలుగుదేశం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రాష్ట్ర స్థూల ఆదాయంలో 2 శాతం సంపద వీరి నుంచే వస్తోంది. ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న ఈ రంగాన్ని పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం నాబార్డు, ఎన్‌సిడిసి, జీవక్రాంతి, గొర్రెల బీమా వంటి పథకాల అమలుకు పూనుకోవాలి.

## మత్స్యకారుల జీవితాలు - బుగ్గిపాలు

10 లక్షల మంది మత్స్యకారులు వేటపై ఆధారపడి ఉన్నారు. వీరిలో నిరక్షరాస్యత ఎక్కువ. వీరు నివసించే గ్రామాల్లో 70 శాతం కరెంటు, మంచినీరు, డ్రెయినేజీ, రోడ్డు సౌకర్యాలు లేవు. రుణాల రద్దు, మత్స్యకారుల పిల్లల విద్య కోసం ప్రత్యేక రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటన్నారు. సంవత్సరం పూర్తయినా తన హామీల అమలులేదు. మత్స్యకారుల సంఘాల బకాయిలు 42 కోట్లు రద్దు చేయలేదు. మోటారైజ్‌డ్ పడవలకు డీజిల్ సబ్సిడీ ఇవ్వకుండా ధనికుల మెకనైజడ్ పడవలకు సబ్సిడీలిచ్చి సాంప్రదాయ మత్స్యకారులకు ద్రోహం చేస్తున్నారు. సముద్రతీర మత్స్యకారులకు ఔట్ బోర్డు మోటర్స్ పంపిణీ చేస్తామన్న వాగ్దానం కొందరికే పరిమితమైంది. విశాఖ జిల్లాలో వెయ్యి మందికి మోటర్లు వ్యాల్సుండగా 30 మందికే ఇచ్చారు. ప్రభుత్వం ఆదాయం కొసమని వ్యాపారస్తులకు లాభం చేకూరుస్తూ ప్రభుత్వం ఆదాయం కొసమని వ్యాపారస్తులకు చేకూరుస్తూ పంచాయితీ, మైనర్ ఇరిగేషన్ చెరువులను మత్స్యకార సొసైటీలకు ఇవ్వకుండా బహిరంగ వేలం వేసి ఉపాధినే హరించేలా ప్రభుత్వ చర్యలు ఆచరణలోని ఉన్నాయి. సముద్ర బంజరులు పంచుతాం.

పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలకు సెజ్‌లు, పిసిపిఐఆర్, కారిడార్, విమానాశ్రయాలు, విద్యుత్ పాంట్ల పేరుతో పందేరం చేయడానికి సిద&ధమవుతూ మత్స్యకారులను గ్రామాలనుండి తరిమేకుట్ర చేస్తున్నది. అందుకు పోలీసుల కాల్పుల్లో ప్రాణాలు తీయిస్తున్నారు. అక్రమ కేసులు బనాయిస్తున్నారు. సోంపేట, మందస, కాకరాపల్లి, బోగాపురం, పోలాకి, కాకినాడ, పాయకారావుపేట, మచిలీపట్నం, గంగవరం, కృష్ణపట్నం, తదితర ప్రాంతాలలో ఘటనలే దీనికి నిదర్శనం. ఇదంతా పారిశ్రామికవేత్తల ప్రయోజనాల రక్షణకు మత్స్యకారుల నాశనానికి దాంరి తీస్తున్నాయి. ఈ సంవత్సరం ఏప్రిల్, మే నేలలో చేపల వేట నిషేధం వలన నిర్వాసితులైన మత్స్యకారులకు నిరుదోగ్య భృతి కోసం రూ.14 కోట్లు కేటాయిచారు. రూ.2 కోట్లు మాత్రమే విడుదల చేశారు. ఇది ఏ మూలకు? ప్రభుత్వానికి చిత్తశుద్ధిఉంటే మిగతా12 కోట్లు కూడా వెంటనే విడుదల చేయాలి. సముద్ర తీర మత్స్యకార కుటుంబానికీ 3 ఎకరాల సముద్ర బంజరు భూమి ఇవ్వాలి. చనిపోయిన మత్స్యకారుల కుటుంబీకుల సహాయార్థం తక్షణమే రూ.పదేసి లక్షల నష్టపరిహారం ఇవ్వాలి. సముద్రతీర ప్రాంత మత్స్యకారుల జీవనోపాధి గ్యారంటీకి చట్టం చేయాలి.

### రజక వృత్తిదారులకు శూన్యహస్తాలు

రజకవృత్తిదారులు రాష్ట్రంలో 12 లక్షల మంది ఉన్నారు. నిరక్షరాశ్యత ఎక్కువ. ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు, భూమిలేని వారెక్కువ, దారిద్ర్య రేఖదిగువనే అత్యధికుల జీవనం. గతంలో వృత్తికి ఆధారంగా ఉండే గ్రామ చెరువులను నేడు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఆ చెరువుల్లో చేపలు వేలం వేసి అమ్ముకుంటోంది. శ్రీకాకుళం, విజయనగరం, ప్రకాశం, కడప, నెల్లూరు తదితర జిల్లాల్లో రజకులపై జరుగుతున్న సాంఘిక బహిష్కరణలనూ, వీరి స్త్రీలపై జరుగుతున్న అ(హ)త్యాచారాలనూ, కుల వివక్షతనూ అరికట్టడానికి సామాజిక రక్షణ చట్టం లేదు. కవాలి. వృత్తి నిర్వహణకు ఉపయోగపడే బొగ్గు, సబ్బు, సర్ఫులు, సోడా వంటి ముడి సరుకులు సబ్సిడీ ధరలపై అందజేస్తామన్నారు. ఆచరణలో, వీటి ధరలను మరింత పెంచింది. రజక వృత్తిదారులపై భారాన్ని మోపింది. ప్రతి సొసైటీకి 7.5 లక్షల రూపాయలు రుణం ఇస్తామన్నారు. ఏ ఒక్క సొసైటీకీ ఇంతవరకూ నిధులు మంజూరు కాలేదు. దేవాలయాలు, ఆసుపత్రులు, రైల్వేలు, యూనివర్సిటీలు, పోలీసు శాఖ, తదితర ప్రభుత్వ సంస్థలలో దోబీ పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామన్న ప్రభుత్వం కాంట్రాక్టు బేస్ పద్ధతిలో ప్రైవేటు సంస్థలకు ఇచ్చి ముడుపులు పుచ్చుకుంటోంది. దోబీ ఘాట్ నిర్వహణకు కరెంటు ఛార్జీలను తానే చెల్లిస్తానని చెప్పి

ఆచరణలో రజకులే భరించాలంటున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా ముడి సరుకులను అందించాలని, బడ్జెట్‌లో కేటాయించిన 50 కోట్లు రూపాయలను తక్షణమే ఖర్చుచేయాలని, భూస్వాములు, పెత్తందారుల నుండి రక్షణ కోసం సామాజిక రక్షణ చట్టం తీసుకురావాలని తదితరాలపై ఉద్యమించాలి.

## మేదర వృత్తిదారులు విలవిల

సరళీకృత ఆర్థిక విధానాల మూలంగా పారిశ్రామికవేత్తలు – పర్యావరణాన్ని పక్కనబెట్టి అడవులను ధ్వంసం చేస్తున్నారు. దీనితో వెదురు సంపద రోజు రోజుకూ తగ్గిపోతోంది. వెదురుపై జీవనం కొనసాగించే లక్షలాది మంది మేదరులు ఉపాధి కోల్పోతున్నారు. వెదురును కాగితం తయారు చేసే పరిశ్రమలకు తక్కువ ధరకూ, తట్టలు బుట్టలు అల్లుకునే మేదరులకు ఎక్కువ ధరకూ అమ్ముతున్నారు. మార్కెట్ ధరలు కంటే సగం సబ్సిడీతో కావాల్సినంత వెదురు సరఫరా చేసి మేదరులను ఆదుకుంటామని టి.డి.పి చెప్పంది. జీవో నెం : 326 ప్రకారం వెదురు సొసైటీలోని ప్రతి సభ్యునికీ 2,500 వెదురు గడలు సరఫరా చేయాల్సి ఉంటే కేవలం 250 గడలే ఇస్తున్నారు. అది కూడా బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తున్నది. ఒక లారీ లోడు (2,500 గడలు)కు మేదర సొసైటీ నుంచి లక్ష రూపాయలు వసూలు చేస్తుండగా కాగిత పారిశ్రామికవేత్తలకు రూ. 25 వేలకే ఇస్తోంది. ప్రభుత్వం ఎవరి పక్షాన ఉందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం సరఫరా చేసే గడలు చాలక ఫారెస్టులో వెదురు గడలు తెచ్చుకుందామంటే అక్రమ కేసులు పెట్టి హింసిస్తున్నారు. ఎర్రచందనం దొంగతనం చేసిన వారిని వదలివేయడం, బతుకు దెరువుకోసం అడవిలోకి వెళ్లిన మేదర వారిని పట్టుకొని కేసులు పెట్టి ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసం?. ఆంధ్రప్రదేశ్‌లో 400 మేదర సొసైటీ లున్నాయి. వీటిలో 80 వేల మంది సభ్యులుగా ఉన్నారు. సంఘాల ఆందోళన ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫెడరేషన్ ఏర్పాటు చేసింది. రెండేళ్ల కాలంలో రూ. 30 కోట్లు కేటాయించి పైసా కూడా ఖర్చు చేయలేదు. ఈ యేడాది రూ.15 కోట్లు కేటాయించి విడుదల చేయలేదు. ఇప్పుడైనా ప్రతి సొసైటీకీ జీవనోపాధి నిమిత్తం 2,500 వెదురు గడలు 50 శాతం సబ్సిడీపై ఇవ్వాలి. వన సంరక్షణ సమితుల్లో వెదురును పెంచేందుకు చర్యలు తీసుకోవాలి. త్రిపురలోని వామపక్ష ప్రభుత్వం వెదురు వృత్తిదారుల ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేస్తూ అదుకుంటోంది. చైనా ప్రభుత్వం వెదురు పెంపకాన్ని

ప్రోత్సహిస్తోంది. దానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం పర్యవరణాన్ని గాలికొదిలేసి అడవులను ధ్వంసం చేసి మేదరు వృత్తిదారులకు అన్యాయం చేయడం సబబా?

## పంచ వృత్తులు గిలగిల

విశ్వబ్రాహ్మణులు ఐదు వృత్తులు (స్వర్ణకార, వడ్రంగం, కంచరం, శిల్పం తయారీ, కమ్మరి పనులు) నిర్వహిస్తున్నారు. ప్రపంచీకరణ విధానాలు వల్ల ఈ వృత్తులు దెబ్బతిన్నాయి. వీరు ఉపాధిలేక గ్రామిణ శ్రామికులుగా మారిపోయారు. వలసలు పెరిగాయి. స్వర్ణకారులను పోలీసుల వేధింపుల నుండి విముక్తి చేయటానికి 1986లో పోలీస్ శాఖ మెమోను చట్టం చేసింది. తద్వారా స్వర్ణకారులను ఆదుకుంటామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో అమలు చేయడం లేదు. దొంగలు చెప్పే మాటలకు విలువ ఇస్తూ స్వర్ణకారులను వేదిస్తున్నారు. వారిపై అక్రమ కేసులు, అరెస్టులు చేస్తున్నారు. స్వర్ణకార వృత్తిలోకి కార్పొరేట్ రంగం ప్రవేశించి సాంప్రదాయ వృత్తిదారుల ఉపాధిని కబళిస్తున్నది.

మరో ప్రముఖ వృత్తి వడ్రంగం. వ్యవసాయానుబంధ వృత్తి. వ్యవసాయంలో యాంత్రీకరణ ప్రవేశంతో ఈ వృత్తిలో ఉపాధి కోల్పోయి వలసలు పెరిగాయి. కొద్దిమంది మాత్రమే పట్టణాలలో ఉపాధి పొందుతున్నారు. అక్రమ కలప తీసుకువస్తున్నారని వేధిస్తున్నారు. స్మగ్లింగ్ చేసే టింబర్ వ్యాపారుస్తులను వదిలిపెట్టి వీరిపై కొరడా ఝుళిపిస్తున్నారు. విదేశీ వస్తువుల దిగుమతితోనూ, ప్లాస్టిక్ వస్తువుల తయారీతోనూ కంచరులు ఉపాధి కోల్పోయారు. ఇత్తడి, రాగి వస్తువుల తయారీలో ఆధునిక యంత్రాల ప్రవేశంతో ఈ వృత్తి కను మరుగౌతుంది. కమ్మరి వృత్తి పూర్తిగా ధ్వంసమైంది. శిల్పులకు ఆదరణ తగ్గింది. మట్టి వినాయకుల తయారీ పెరిగిపోయింది. వీరిని ఆదుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రహ్మణ ఫెడరేషన్ ఏర్పాటు చేసింది. గత రెండేళ్లుగా నిధులు కేటాయించడం తప్ప ఒక్కరికీ ఉపాధి కల్పించింది. ఈ వృత్తుల్లో ఉపాధి కోల్పోయిన వారిని రక్షించడానికీ, వారి సమస్యలను అధ్యయనం చేయటానికీ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

## కష్టాల్లో కుమ్మరి వృత్తిదారులు

రాష్ట్రంలో 30 లక్షల కుమ్మరులుంటారని అంచనా. వీరిలో 10 శాతం మంది ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. జీవో నెం.1076 ప్రకారం వీరి వృత్తికి అవసరమైన మట్టిని ఆయా గ్రామాల్లోని కుంటలు, చెరువుల నుండే కేటాయిస్తామనీ మ్యానిఫెస్టోలో

చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత నీరు–చెట్టు తీసుకువచ్చి కుంటలు, చెరువుల్లో మట్టిని అమ్ముకొనేందుకు కాంట్రాక్టర్లకు అవకాశం ఇచ్చింది. దీంతో కొత్త ఉపాధి లేక పోగా ఉన్న వృత్తి పోయింది. అనేక జిల్లాల్లో కుమ్మరులకు కేటాయించిన భూములను రియల్టర్లు అక్రమించి వీరిని బలవంతంగా గెంటేస్తున్నారు. పట్టణాలలో, గ్రామాలలో ప్రభుత్వం నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్‌లను నామినేషన్ పద్ధతి (జీవో నెం.326) ప్రకారం కుమ్మరులకు కుండలు అమ్ముకోవడానికి అవకాశం కల్పించాలి. ఉన్న హక్కులను కాలరాసి ధనికులకే షాపులు కేటాయిస్తున్నారు. ఇప్పటికైనా 520 సొసైటీలకు రూ.20 కోట్ల సబ్సిడీతో 50 శాతం బ్యాంకు లోను ఇప్పించి రుణాలు మంజూరు చేయాలి. బ్యాంకు రుణాలకు ప్రభుత్వమే గ్యారంటీ ఇవ్వాలి. నిధులు కేటాయించి అర్ధసంవత్సరం అవుతున్న లబ్దిదారులను గుర్తించలేదు. మాటలు కోటలు దాటుతున్నా ఆచరణ గడప దాటడం లేనట్లుంది తెలుగుదేశం వ్యవహారం. ప్రత్తి సొసైటీకి ఏడున్నర లక్షల రూపాయలు తక్షణమే మంజూరు చేయాలి. 50 శాతం సబ్సిడీ 50 శాతం బ్యాంకురుణం ఇప్పించాలి. కుమ్మరులను ఆదుకోవాలి.

## క్షౌరవృత్తిదారులకే క్షవరం

రాష్ట్రంలో క్షౌరవృత్తిపై ఆదారపడి జీవించేవారు 6.5 లక్షల మంది *ఉన్నారు. రెండు వేల సొసైటీలు రిజిస్టరై ఉన్నాయి. ఈ ఏడాది 786 సొసైటల్లోని చెందిన 12 వేల మందికి రూ.60 కోట్లు మంజూరుచేస్తాం. ఉపాధి జీవనోపాధి కల్పిస్తామని రాష్ట్ర క్రెడిట్ ప్లాన్‌లో పేర్కొన్నారు. గతేడాది కూడా ఇవే కేటాయింపులు చేశారు. ఆచరణలో వయోపరిమితి, బ్యాంకు గ్యారంటీ లాంటి నిబంధనలను పెట్టి నిధులు ఖర్చు చేయకుండా గాలికి వదిలేశారు. అధునాతన క్షౌరశాలల నిర్వహణకు అవకాశం, ఈ వృత్తిదారులకు వృత్తిలో ఆధునిక శిక్షణ, 50 శాతం సబ్సిడీతో, తక్కువ వడ్డీతో సంస్థాగత రుణాలు ఇస్తామన్నారు. తరువాత అసలు ప్రస్తావనే లేదు. క్షౌరవృత్తిని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి అసలు వృత్తిదారులకు క్షవరం చేస్తోంది ప్రభుత్వం. తక్కువ టారీఫ్‌తో విద్యుత్ సరఫరా హామీ గాలికొదిలేసి కరెంటు ఛార్జీలు పెంచింది. వృత్తిని భారంగా మార్చింది. డోలు, సన్నాయి తదితర వాయిద్య కళాకారులకు శిక్షణ ఇవ్వటానికి శిక్షణా కేంద్రాలను నెలకొల్పుతామని చెప్పి నిధులు ఇవ్వకుండా మొండిచేయి చూపింది. నాయీ బ్రాహ్మణులకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు పెంచి జీవనోపాధిని కల్పిస్తామని ఊరించి ఉపాధిని హరించేస్తున్నది.*

## దర్జాకోల్పోయిన దర్జీ వృత్తిదారులు

రాష్ట్రంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం 15 లక్షల మంది ఈ వృత్తిపై జీవిస్తున్నారు. గ్రామస్థాయిలో 450 సొసైటీలు రిజిష్టరై ఉన్నాయి. వీరికి సంక్షేమ పథకాలు వర్తింపు చేయాలనీ సొసైటీలో రుణాలివ్వాలనీ రాష్ట్ర ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్న పట్టించుకోదు. టి.డి.పి అధికారంలోకి రాగానే వెంటనే టైలర్ ఫెడరేషన్ ఏర్పాటుకు ఇచ్చిన జీవో నెం.86ను రద్దు చేసింది. ఈ ఫెడరేషన్‌కు కేటాయించిన నిధిని ఖర్చు చేయలేదు. తక్కువ టారీఫ్‌తో టైలర్ షాపులకు విద్యుత్ ఇవ్వాలనే కొర్కెను అంగీకరించడం లేదు. అసంఘటిత కార్మికులుగా తక్కువ టారీఫ్‌తో టైలర్ షాపులకు విద్యుత్ ఇవ్వాలనే కొర్కెను అంగీకరించడం లేదు. అసంఘటిత కార్మికులుగా ఉన్న వీరికి ఎటువంటి సంక్షేమ పథకాలూ వర్తించవు. రెడీమేడ్ తయారీ రంగానికి ప్రాధాన్యతనిస్తూ వీరి ఉపాదిపై దెబ్బకొడ్తున్నది. వృద్ధాప్య పింఛన్లు  దర్జీలకు కళ్లద్దాలు,  టైలర్స్ కాంప్లెక్స్ నిర్మించి ఇవ్వాలి, రద్దుచేసిన ఫెడరేషన్‌ను పునరుద్ధరించి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాల్సింది.

## హస్తకళలకు – రిక్తహస్తం

గ్రామ, పట్టణ ప్రాంతాల్లో హస్తకళల తయారీలో శిక్షణ ఇప్పించి, పనిముట్లు కొనుగోలుకు 50 శాతం సబ్సిడీ ఇస్తాం. వాటి ఉత్పత్తికి తక్కువ వడ్డీపై సంస్థాగత రుణాలు సమకూరుస్తామన్నది తెలుగుదేశం వాగ్దానం. పైపెచ్చు వడ్డీ లేని రుణాలు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. ముఖ్యంగా కొండపల్లి బొమ్మలు తయారీ, ఏటికొప్పాక లక్క బొమ్మలు తయారీ, పశ్చిమగోదావరి జిల్లాలో లేసుల అల్లకం, కృష్ణాజిల్లా పెడనలో కలంకారీ  పరిశ్రమల మొ॥వాటిపై లక్షలాది మంది ఆధారపడి జీవిస్తున్నారు. వీరికి ఏ ఆర్థిక సహాయమూ లేదు. ఎన్నికలప్పుడు కడవల కొద్దీ కురిపించిన అమిత ప్రేమ, సానుభూతి తర్వాత ఏమైంది?

## కష్టాల కడలిలో వడ్డెర వృత్తిదారులు

వడ్డెర సొసైటీలకు క్వారీలు నామినల్ లీజుకు అప్పగిస్తానని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో పెద్ద కాంట్రాక్టర్లకు అప్పగించి ముడుపులు తీసుకుని వడ్డెరలకు తీవ్రమైన ద్రోహం చేస్తోంది. గత 3 సంవత్సరాల కాలంలో  వడ్డెరలకు బడ్జెట్‌లో కేటాయించిన 30 కోట్ల రూపాయల్లో రూ. 3 కోట్లు కూడా ఖర్చు చేయలేదు. తెలుగుదేశం మ్యానిఫెస్టోలో వడ్డెరలకు సబ్సిడీపై క్రషర్‌లు, జెసిబిలు ఇస్తామంది. సొసైటీకి యూనిట్ కాస్ట్‌ను రూ.7.5

లక్షలుగా నిర్ణయించింది. 50 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంకు లోను ఇస్తామన్నారు. ఆచరణలో గ్యారెంటీ ఉంటేనే బ్యాంకు లోన్లు. వాస్తవంగా మార్కెట్‌లో జెసిబి ఖరీదు రూ.25లక్షలుంది. రూ.7.5లక్షలతో జెసిబిని ఎలా కొనుగోలు చేస్తారో ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. ఏ ఆస్తి లేని వడ్డెరలు లక్షలాది రూపాయలు పెట్టి ఆధునిక యంత్రాలను ఎలా కొనుగోలు చేయగలరు? ప్రపంచీకరణ విధానాల వలన యంత్రాల ప్రవేశంతో వృత్తిలో ఉపాధి కోల్పోయిన వారు వడ్డెరలు. పెద్ద కాంట్రాక్టర్లు నడుపుతున్న క్వారీలు, నిర్మాణాల్లో క్రషర్లలో వడ్డెరలు కట్టుబానిసలుగా జీవిస్తున్నారు. ఏ రక్షణా లేని వలస పక్షులుగా బతుకు లీడుస్తున్నారు. వీరి పిల్లల సంక్షేమానికి, విద్యాభివృద్ధికి కేటాయించిన పథకాలన్నీ నిర్వీర్యం అవుతున్నాయి. వాగ్దానం చేసినట్లు వీరి పిల్లల కోసం ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలి. ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వ గ్యారెంటీతోనే ఋణాలు ఇప్పించి ఆధునిక పనిముట్లు కొనుగోలుకు సహకరించాలి. ప్రభుత్వం కాంట్రాక్టర్లు ఏ పనుల్లో వారికి ఉపాధి కల్పించాలి. ప్రభుత్వ విధానాల వల్ల విల విల లాడుతున్న వృత్తులు, రక్షణ లేక ఉపాధి కోల్పోతున్న వృత్తిదారుల పరిరక్షణకై ఉద్యమం తప్ప మరో మార్గం లేదని సిపియం పార్టీ విశ్వసిస్తుంది. దీనికై బలహీన వర్గాలకు చెందిన వారంతా సమైక్యంగా సబ్‌ప్లాన్ కోసం ఉద్యమించాల్సిందిగా పిలుపునిస్తోంది.

♦ ♦ ♦

# డిమాండ్స్

1. చేతి వృత్తిదారుల సంక్షేమానికి వృత్తిదారుల సబ్ ప్లాన్‌కు రూ. 10 వేల కోట్లు కేటాయించాలి. ఈ సంవత్సరం కేటాయించిన రూ.3.127 కోట్లు తక్షణమే విడుదల చేయాలి.
2. వృత్తిల వారీగా ప్రణాళికలు రూపొందించి వృత్తి దారుల సంఖ్యకనుగుణంగా వృత్తుల రక్షణకూ, ఉపాధికీ నిధులు కేటాయించాలి.
3. వృత్తిదారుల పిల్లలందరికీ ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలి.
4. బి.సి.ల సామాజిక భద్రతకు చట్టం చేయాలి.

పైన తెలియజేసిన చేతి వృత్తులు, కుల వృత్తుల డిమాండ్ల సాధన కోసం బలహీన వర్గాల వారంత కల్సిరావాలని సిపియం విజ్ఞప్తి చేస్తున్నది. వీరి పోరాటాలకు అన్ని రకాలుగా అండగా నిలబడుతోంది.

వెల రూ. 2/-

సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, 27-13-3, ఆకుల వారి వీధి, గవర్నర్‌పేట విజయవాడ - 2
ఫోన్ నెం. 0866 - 2577202, ప్రచురణ కర్త: పి.మధు, రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ(ఎం) పార్టీ, ఆంధ్రప్రదేశ్